

# జాతస్య మరణం ధ్రువం

'వింధ్యవాసిని'

కళాశాల గేటుముందర ప్రిన్సిపాలుగారి కారు ఆగగానే, కాలేజీ ఆవరణలో, వరండాల్లో వాతావరణం మారిపోయింది.

అక్కడక్కడా గుంపులుగా కూడుని, ఏవో సీరియస్‌గా చర్చలు చేస్తున్న విద్యార్థినుల్లో ఒక క్రమశిక్షణ ఏర్పడింది. అంతవరకూ కాకి అరుపుల గోలవలె ఉన్న వారి మాటల శబ్దం, ఇప్పుడు పిచ్చుకల కిచకిచల స్థాయికి దిగింది.

ప్రిన్సిపాల్ భగవతి కారుకు డ్రైవరు లేడు. తనే స్వయంగా నడుపుకుని వస్తుంది. కారు దిగి, తలుపులు బిగించి తాళాలు పెట్టి, హుందాగా లోపలికి నడిచి వచ్చింది ఆమె. ఆమె నడకలో, ప్రవర్తనలో ఉన్న హుందాతనం ఆమె ఆకారంలో కనిపించదు. అయిదడుగులకు తక్కువయిన ఎత్తు, పలుచని శరీరం, సగం నెరిసిన పలుచని జుట్టును వేళ్ళతో తిప్పి వేసుకున్న చిన్న ముడి, నేత చీర, హవాయి చెప్పులు— ఇదీ ఆమె రూపం. చూడగానే ఆమె ఆ సంస్థకు అధిపతి అని కొత్తవాళ్ళకయితే అనిపించదు. ప్రిన్సిపాలును చూడవచ్చిన వారెందరో, వరండాలో భగవతి కనిపిస్తే, ఆమె ఏ ఆయెందరో అనుకుని, "ప్రిన్సిపాలు రూమెక్కడ?" అని అడిగిన సందర్భాలున్నాయి. కానీ అక్కడి ఉపాధ్యాయినులు, విద్యార్థినుల మనసుల్లో ఆమె పట్ల గల గౌరవాభిమానాలకు కారణం భగవతి వ్యక్తిత్వమే కానీ, ఆమె రూపురేఖా విశేషాలు కావు.

పది సంవత్సరాల క్రితం, ఆ కళాశాల స్థాపన జరిగింది. ఆనాటి నుంచీ భగవతి అక్కడ ప్రిన్సిపాలుగా ఉంటున్నది. చరిత్ర ఆమె బోధనా విషయం. ప్రిన్సిపాలు అయినందువల్ల, విద్యార్థినులకు పాఠాలు చెప్పే అవకాశాలు తగ్గిపోయాయి. ఉపాధ్యాయ వృత్తిపై గొప్ప అభిమానాన్ని పెంచుకుని అందులో చేరిన వ్యక్తి ఆమె. అందుకే తనకోసం కేటాయించుకున్న కొన్ని గంటలు క్లాసులను మాత్రం, ఎన్ని పనులున్నా వీలుచేసుకుని, హాజరు అయి పాఠాలు చెబుతుంది.

భగవతి తన గదిలో ప్రవేశించటం క్లాసులకు సమయం అయినట్లుగా కాలేజీ గంట మోగటం ఒకేసారి జరిగాయి. దాంతో బయట గోల పూర్తిగా సద్దు మణిగి పోయింది.

టేబిల్ మీద కాగితాలు, ఫైళ్ళు అన్నీ సర్దుకుని, ఆవేళ తను చేయవలసిన పనులు, చూడవలసిన కాగితాలు అన్నీ మనసులోనే లిస్ట్ వేసుకునే వరకూ, భగవతి కుర్చీలో కూచోదు.

తలుపుదగ్గ రెవరో తచ్చాడుతున్న శబ్దం వినిపిస్తే తలెత్తి చూసింది. స్వీపరు మంగమ్మ, బోటనీ లాబ్ అటెండరు యూసఫ్‌ఖాన్ నిలుచుని ఉన్నారు.

కుర్చీలో కూచుంటూ, "రా మంగమ్మా. ఏమిటి సంగతి?" అని నవ్వుతూ పలుకరించింది భగవతి. ఆ కళాశాలలో విద్యార్థిని అయినా, ఉపాధ్యాయిని అయినా, స్వీపర్ కానీ, అటెండరు అవనీ, తనను ఎవరు చూడవచ్చినా, సమానస్థాయిలో, గౌరవించి, అభిమానంగా పలకరించడం ఆమెకు అలవాటు.

"అమ్మా. మీరు విదేశాలకు పోతున్నారని విన్నాం. నిజమేనా? ఎప్పుడెళుతున్నారమ్మా?" అడిగింది మంగమ్మ తటపటాయిస్తూనే.

"అవును ఒక నెలరోజులపాటుండను. సుందరమ్మ మేడమ్‌గారు నాస్థానంలో ఉంటారు. మీకే అవసరం వచ్చినా ఆమెను చూడవచ్చును."

"అది కాదు మేడమ్. మేమంతా కలిసి మీకు పార్టీ ఇవ్వాలని అనుకున్నాం. గొప్పగా చెయ్యలేమనుకోండి మాకు చాతనయినంత ........ మీకు ఎప్పుడు వీలవుతుందో చెప్తే మేం ఏర్పాట్లు చేసుకుంటాము" యూసఫ్‌ఖాన్ అన్నాడు.

భగవతి నోట మాట రాలేదు. సంతోషంతో ఆమె మనసు నిండిపోయింది ఎలాగో గొంతు పెగుల్చుకుని, "బహుశా ఈ నెల ఇరవయ్యవ తేదీ నేను బయలుదేరవచ్చు. వచ్చే ఆదివారం పెట్టుకోండి మీ పార్టీ. మరు టైం చెప్తే నాకు వీలయేలాగ చూసుకుంటాము" అని చెప్పి, వారిని పంపేసింది.

ముఖ్యమయిన విషయం ఒకటి ఆఫీస్ క్లర్క్ లక్ష్మిని అడగవలసినది గుర్తొచ్చింది. ఆ అమ్మాయికి ఒక కాలు లేదు. ఆమెతో ఏ పని ఉన్నా, బెల్ కొట్టి తన గదికి పిలిపించదు భగవతి. తనే ఆఫీసురూముకు వెళ్ళి మాట్లాడి వస్తుంది.

ఆమెదగ్గరికి వెళదామని కుర్చీలోంచి లేచిన భగవతి, కర్రసాయంతో లక్ష్మి తన దగ్గరికి రావటం గమనించింది. "రా లక్ష్మీ. కూర్చో. నా వీసా సంగతే

మేయిందో కనుక్కున్నావా?" అని అడిగింది.

"ఇదిగో మేడమ్. ఇప్పుడే పోస్టులో వచ్చింది. నిన్న ట్రంకాల్ చేసి అడిగితే పంపించేశామన్నారు," అంటూ బ్రౌన్ కవర్ ఒకటి తీసి భగవతి చేతికిచ్చింది లక్ష్మి.

కవర్ తెరిచి చూసుకుంది భగవతి.

"అయితే ఇరవయ్యవ తేదీ వెళ్ళడం నిశ్చయం అయినట్లే. ఏం లక్ష్మీ అమెరికా నుంచి నీకేం తెమ్మంటావు?" సరదాగా అడిగింది.


"నాకేం వద్దు మేడమ్. మీరు వెళ్ళిన పని విజయవంతంగా ముగించుకుని తిరిగి వస్తే చాలు" అంటున్న లక్ష్మి, ఇంతలో ఎవరో విద్యార్థిని తల్లిదండ్రులు ప్రిన్సిపాలును చూడరావటం గమనించి, అక్కడినుంచి లేచి వెళ్ళిపోయింది.

ఆ కళాశాలలో విద్యార్థినులను తప్పు చేస్తే, క్లాసులో మందలించే అలవాటు లేదు. ఒక్కొక్కరినీ ప్రత్యేకంగా పిలిచి చెబుతారు. అవసరం అయితే విషయం ప్రిన్సిపాలు వరకూ వస్తుంది. ఆమె ఆ విద్యార్థిని తల్లిదండ్రులకు ఒక తేదీ చెప్పి, వచ్చి కలుసుకొమ్మని సూచిస్తుంది. వాళ్ళు వచ్చినప్పుడు, సంబంధించిన టీచరు, ప్రిన్సిపాలు కలిసి సమస్యను చర్చించి ఏం చేయాలో నిర్ణయిస్తారు. ఈ విధంగా, ప్రిన్సిపాలుకు, చాలామంది విద్యార్థినుల తల్లిదండ్రులతో పరిచయం, స్నేహం ఏర్పడుతుంటాయి.

* * *

సాయంత్రం అయిదు గంటలయి వుంటుంది. అంతకు కొన్ని నిముషాల క్రితమే ఇంటికొచ్చిన భగవతి కాఫీ తాగి, ప్లాస్టిక్ పైపుతో మొక్కలకు నీళ్ళు పెడుతోంది. ఆమె కొత్తగా ఇల్లు కట్టించుకుని అందులో గృహప్రవేశం చేసి ఆరు నెలలయింది. తన తండ్రి పేరు జ్ఞాపకార్థం, ఆ ఇంటికి 'నారాయణ నిలయం' అని నామకరణం చేసుకుంది. ఆయనకు మొక్కలన్నా, తోటపని అన్నా తగని ప్రీతి. ఆయన ఉద్యోగకాలంలో బదిలీ అయివెళ్ళిన ప్రతి వూర్లో, ఇంటి చుట్టూ పూవులు, కూరగాయల తోట వెలిసేది. అందుకే భగవతి కూడా తన ఇంటి చుట్టూ ఒక నందన వనాన్నే తయారు చేయాలని కలలు కంటూ ఉంటుంది. గృహప్రవేశం చేసిన మరురోజే నాటిన మొక్కలన్నిటికీ ప్రతిరోజూ తనే స్వయంగా పాదులు సరిజేసి నీరు పోయటం ఆమెకు సంతృప్తిగా ఉంటుంది.

గేటు ముందర సైకిళ్ళ చప్పుడు విని తలెత్తి చూసింది. తన కళాశాల విద్యార్థినులు, మనోహరి, కామమతి సైకిళ్ళు




స్టాండులు వేస్తూ కన్పించారు పైప కింద పడేసి, కుళాయి కట్టేసి, పైకెత్తి, చెక్కిన చీర కుచ్చిళ్ళు విడదీసుకుంటూ ఇవతలికి వచ్చింది భగవతి.

పొట్టిగా పచ్చిమిరపకాయలా కనిపించే మనోహరి, చక్కగా లంగా, దావణి వేసుకుంటే, సన్నగా రివటలాగున్న భామమతి ఎప్పుడూ జీన్స్‌లోనో, మిడ్డీల్లోనూ కనిపిస్తూంటుంది. ఒకరు సైన్సు విద్యార్థిని. మరొక అమ్మాయి బియ్యే రెండవసంవత్సరం చదువుతోంది. వీళ్ళిద్దరికీ ఎలా జంట కుదిరిందో కానీ, క్లాసుల్లో తప్ప, మిగతా సమయం అంతా, కాలేజీలో ఎక్కడయినా జతగానే కనిపిస్తుంటారు. భగవతి సనాతన సాంప్రదాయాలకు ఎంతగా విలువిచ్చే వ్యక్తి అయినా, వేసుకునే దుస్తులు అసభ్యం కానంతవరకూ, తన విద్యార్థినుల సరదాలు ఆమెకూ ఇష్టమే. రకరకాల పువ్వుల నడుమ కనిపించే వైవిధ్యం, ఆమెకు అమ్మాయిల వేషభాషల్లో కనిపిస్తుంది.

"నమస్తే మేడమ్," అని ఏక కంఠంతో అంటూ లోపలికొస్తున్న వాళ్ళిద్దర్నీ చూసి నవ్వుతూ, "ఏమ్మా చాలా బిజీ అయిపోయినట్లుందే. కాలేజీలో కలుసుకోవటానికి సమయం దొరకలేదా?" అని పలకరించి లోపలికి ఆహ్వానించింది భగవతి.

"మేమేం బిజీ మేడమ్! మీరే చాలా

బిజీగా ఉంటారు. ఎప్పుడు వచ్చినా, మీ గదిలో ఎవరో ఒక అతిథి వుంటారు. క్లాసు ఎగవేసి వస్తే, కోపగిస్తారు మీరు. అందుకనే కూడబలుక్కుని ఇంటికొచ్చాము." అని గలగలా మాట్లాడేసింది మనోహరి.

అమ్మాయిలిద్దర్నీ కూచోమ్మని చెప్పి, పనిమనిషికి టీ చేసి తెమ్మని పురమాయించింది భగవతి.

గోడలకు, పూలమాలలతో అలంకరింపబడిన వివేకానందస్వామి, రామకృష్ణ పరమహంస పటాలున్నాయి. వాటి వంక చూస్తూ కూచుని ఉన్న భానుమతితో అన్నది భగవతి. "మొన్న టీవీలో నీ ప్రోగ్రాం చూశాను. చాలా బాగుందమ్మాయి. నువ్వింత బాగా గిటార్ వాయిస్తావని నాకు తెలీదు సుమా!" అని అభినందించింది, మనస్ఫూర్తిగా.

ముగ్గురూ టీ త్రాగడం అయింది. అప్పుడు మొదలు పెట్టారమ్మాయిలు, అసలు విషయాన్ని.

"మీరు ఫారిన్ వెళుతున్నారని తెలిసింది మేడమ్!" మనోహరి అన్నతీరులో వివరాలు చెప్పండన్న వేడికోలు ఉంది.

"రామకృష్ణమఠం వారు, భారతీయ సంస్కృతీ వికాస సంస్థవారు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని తయారు చేసారు. దేశమంతా గాలించి పదిమంది ప్రతినిధులను ఎన్నుకున్నారు. ఆ పదిమందిలో నేనొకదాన్ని కావడం నా అదృష్టం. వివిధ దేశాల్లో, మనదేశ సంస్కృతి గురించి, హిందూమతాన్ని, వేదాలను గురించి ఉపన్యాసాలు, చర్చలు నిర్వహించటమే ఈ యాత్ర ఉద్దేశ్యం, నన్నడిగితే మావంటి వృద్ధులతో బాటు, మీవంటి యువ ప్రతినిధులు కూడా ఉంటే బాగుండేది."

"అయ్యో! అలాంటి పెద్ద విషయాలు మాకేం తెలుస్తాయి మేడమ్."

"తెలుసుకుంటే తెలుస్తాయమ్మాయి మన యింట్లోనే మనం కూచుని ఉంటే మన గొప్పతనం, మనకు తెలీదు ఇదీ అంతే. బయటి దేశాలకు వెళితేగానీ, మనమన్నా, మన సంస్కృతి అన్నా, ఎంత గౌరవం, విలువ వున్నదీ మనకు తెలిసే అవకాశం లేదు."

"మీరు వెళ్ళేలోపు మీకు మేమంతా కలిసి పార్టీ ఇవ్వాలనుకుంటున్నాము మేడమ్. మీ కొక చక్కని బహుమతి కూడా ఇస్తాం, వద్దనకుండా తీసుకోవాలి. కాలేజీలో ఇలా అడిగితే, ఏమంటారో అన్న భయంతోనే ఇంటికొచ్చాము. ఇక్కడ మీరు తిట్టినా సరే ఎవరు వినరు కదా అని ధైర్యం"

"ఛ! పిచ్చిపిల్లా. ఎందుకు తిడతాను! కానివ్వండి, మీ ఇష్టం. ఏ రోజా నాకు

పీలయేది రేపు కాలేజీలో ఎంగేజ్‌మెంట్సు బుక్ చూసుకుని చెప్తాను. సరేనా?"

మనోహరి, భానుమతి సంతోషంగా వెళ్ళిపోయారు.

• • •

విద్యార్థినులతో మాట్లాడినప్పుడల్లా కొత్త ఉత్సాహం వచ్చినట్లుంటుంది భగవతికి. సోఫాలో అలాగే కూర్చుండి పోయింది. ఆమె చూపులు ఎదురుగా టి.వి. టేబిల్ మీదుగా ఉన్న ఫోటో వయిపే ఉన్నాయి. ఆ ఫోటోలోంచి తొంగిచూస్తున్న ఒక నవయువకుని ముఖం. ఆ పెదవులమీది దరహాసం చూస్తుంటే— ఆ వ్యక్తి— శివానందమ ఎదురుగా చూస్తున్న భ్రమ కలుగుతుంది భగవతికి.

'వీడికి ఎన్నో నేర్పాను కానీ.... క్రమం తప్పకుండా ఉత్తరాలు రాయటం నేర్పటం నా చేతకాలేదు' అనుకుంది భగవతి.

శివానంద భగవతి చెల్లెలి కొడుకు కానీ చిన్నతనంలోనే తల్లిదండ్రులను పోగొట్టుకున్న అతనికి. తల్లీ, తండ్రీ, గురువూ, స్నేహితురాలు అన్నీ తనే అయి పెంచుకుంది భగవతి.

వృత్తి విద్యలన్నిటిలోకీ డాక్టరీ చాలా ఉదాత్తమయినదని భగవతి విశ్వాసం. తనే డాక్టరు అవడానికి, తన కుటుంబ ఆర్థిక పరిస్థితులు తోడ్పడలేదు. అందుకని శివానందకు చిన్నతనంనుంచీ, అందులో ఆసక్తి కల్పించి, అతన్ని డాక్టరు చేసింది. అతను ఎయిర్‌ఫోర్స్ డాక్టరుగా ఢిల్లీలో ఉంటున్నాడు.

శివానందుకు రెండు వారాల కొకసారి భగవతి వ్రాస్తే ఉత్తరాలు అందుకుని ఆనందించటమే తప్ప, జవాబులు వ్రాసే అలవాటు లేదు. అత్యవసరం అయితే టెలిగ్రాం ఇవ్వటమో, లేదా స్వయంగా రావటమో చేస్తాడు. భగవతి తన విదేశ యాత్ర గురించి, గత మూడు మాసాలుగా అతనికి రాస్తూనే ఉంది. తను బయల్దేరేలోపల చప్పున ఏదో ఒకరోజు వచ్చి, తన ఎదురుగా నిలుస్తాడని తెలుసు అయినా నాలుగు లయిన్లు వ్రాసి అయినా ఒక ఉత్తరం అంటూ. అతను వేసి ఉంటే ఒక రకం సంతృప్తి కలిగేది.

'ఫారిన్ నుంచీ తిరిగి రాగానే, చక్కని అమ్మాయిని చూసి, వీడికి ముడి పెట్టెయ్యాలి. ఆలస్యం చేస్తే లాభం లేదు,' అనుకుంది భగవతి. కోడలు వస్తే అయినా, తన ఉత్తరాలకి జవాబులు వ్రాసేవారుంటారని ఆమె ఆశ. అదొక్కటే కాదు శివానందకి పెళ్ళిచేసి, అతనికో ఇద్దరు పిల్లలు పుడితే, వాళ్ళలో ఒకర్ని తన చేతులతో పెంచాలని

ఉబలాటం కూడా ఉంది.

పనిమనిషి ముత్తమ్మ పిలుపు, భగవతిని ఆలోచనల్లోంచి బయటికి తీసుకొచ్చింది. "టెలిగ్రాం వచ్చిందమ్మా. పిలుస్తున్నారు" అంటోంది

లేచివెళ్ళి సంతకం చేసి టెలిగ్రాం తీసుకుంది. "అంటే రేప్పొద్దున శివుడు దిగుతున్నాడన్నమాట. ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళాలి" అనుకుంది భగవతి, టెలిగ్రాం తెరిచి చూడకుండానే.

సంతోషం తాండవిస్తున్న అమ్మగారి ముఖం, టెలిగ్రాం తెరిచి చదవగానే కళావిహీనంగా మారిపోవటం గమనించిన ముత్తమ్మ అదుర్దాపడిపోయింది.

"అమ్మా ఏమయిందమ్మా!" అని ఆమె అడిగేలోపలే, ఒక్కసారిగా, ఒంట్లో శక్తి అంతా హరించుకుపోయినదానిలా నేలమీద పడిపోయింది భగవతి.

బెంబేలు పడిపోయింది ముత్తమ్మ. "అమ్మా.... అమ్మా" అని నాలుగుసార్లు ఆమె భుజాలు పట్టి కుదిపి చూసింది. భగవతిలో చలనం కనిపించలేదు.

వంటగదిలోకి పరిగెత్తి వెళ్ళి గ్లాసులో నీళ్ళు తీసుకొచ్చింది. కొద్దిగా చేతికి తీసుకుని ఆమె ముఖం మీద జల్లింది.

కొన్ని క్షణాలకి మెల్లిగా కళ్ళుతెరిచి చూసిన భగవతి లేచి కూచుంది. ముత్తమ్మ సహాయంతో నేలమీద నుంచి లేచి, సోఫాలో చేరగిలబడింది.

"టెలిగ్రాంలో ఏముందో చెప్పండమ్మా. ఎందుకట్ల పడిపోతిరి?"

ముత్తమ్మ సందేహ నివృత్తి చేసే శక్తి భగవతికి లేదు.

అయినా తప్పదు. చెప్పాలి చెప్పి, తన మనసుకు కూడా విషయాన్ని తెలియజేయాలి. అప్పుడు కలిగే నరక బాధను అనుభవించాలి. మెదడంతా మొద్దుబారినట్లున్న ఆ స్థితి ఆమెకెంతో బాగుంది.

టీపాయ్‌మీదున్న శివానంద ఫోటో కేసి చూస్తూ, "ఎంత హాయిగా నవ్వుతున్నాడు చూడు ముత్యం. బాబుకు ఈ లోకంలోకన్నా అక్కడే బాగుందేమో!" అన్నది నిదానంగా పలవరిస్తున్న దానిలా.

అమ్మగారి తీరు భయాన్ని కలిగిస్తున్నా ఆమె మాటల అర్థం బోధపడిన ముత్తమ్మ గుండె చెరువయింది. ఆవిడ అలా మాట్లాడేకన్నా, భోరుమని ఏడిస్తే బాగుండేదేమో అనిపించింది. ఇప్పుడామెను ఏమని ఓదార్చడం. శివానంద హైస్కూల్లో చదువుతున్న రోజుల్నుంచీ ఆ యింట్లో పనిచేస్తోంది ముత్తమ్మ. పెద్దమ్మా కొడుకులిద్దరూ ఒకరంటే ఒకరు ఎంతగా ప్రాణం పెడతారో



ముత్తమ్మకి తెలిసినంత బాగా మరెవరికీ తెలీదు.

శివానంద ఫోటోవయిపు చూస్తూ భగవతి, ఆవిడ ముఖంలోకి చూస్తూ, కళ్ళనీళ్ళతో ముత్తమ్మ ఎంతసేపున్నారో కానీ, చీకటి పడుతుండగా, కాలేజీలో అటెండరుగా చేసే కేశవయ్య వచ్చాడు. ముత్తమ్మ కేశవయ్య భార్య. ఈమె ఇంట్లో, అతను కళాశాలలో ఒకేసారి పనిలో చేరుకున్నారు.

"నువెళ్ళు ముత్యం. కేశవయ్య వచ్చినట్లున్నాడు" అన్నది భగవతి చూపులు మరల్చకుండానే.

"అమ్మగారూ! మీరొక్కరే...."

"పరవాలేదు నాకేం కాదు. నాది రాతి గుండె. నువెళ్ళు. పిల్లలు చూస్తుంటారు నీకోసం" అని పంపించేసి తలుపులేసుకుంది.

ముత్తమ్మ కూడా వెళ్ళిపోవడంతో, భగవతికి, కట్టలు తెంచుకున్న చెఱువులా, దుఃఖం ముంచుకొచ్చేసింది. పడకగదిలో తలదిండులో, ముఖం దూర్చుకుని చాలా సేపు ఏడుస్తూ వుండిపోయింది. కళ్ళల్లో నీరు ఇంకిపోయేదాకా, దిండును తడిపేసింది.

ఒంటరి జీవితానికి అలవాటు పడిన వారికి, ఎంత దుఃఖం, బాధ కలిగినా, కొంతసేపటికి, తమను తామే ఓదార్చుకుని ఉపశమనాన్ని పొందటం అలవాటు అయివుంటుంది. ఆ అలవాటు వల్లనే కొంతసేపటికి భగవతి ఏడుపు ఆగిపోయింది.

లేచి వెళ్ళి, ముందర సోఫాలో పడి ఉన్న టెలిగ్రాం కాయితాన్ని మరొకసారి చదువుకుంది శివానంద వస్తున్న విమానం, అపఘాతానికి గురయి, అందులో ప్రయాణిస్తున్న వారు అందరూ ప్రాణాలు పోగొట్టుకున్న వైనం ఉంది అందులో.

ఎందుకు? ఎందుకిట్లా అయింది?

శివుని అజ్ఞలేనిదే చీమ అయినా కుట్టదంటారే. మరి, ఈ శివుని ప్రాణాలను తీసుకొమ్మని, ఆ శివుడు ఎందుకు అజ్ఞ ఇచ్చాడు? వీడు చేసిన నేరం ఏముంది?

తనకంటె వెనుక పుట్టి, తన చేతుల్లో పెరిగిన శివానంద, తనకన్నా ముందే, తను బ్రతికుండగానే, వెళ్ళిపోయాడు ఇదేం న్యాయం? తన కొడుకని గొప్ప చెప్పుకోవడం కాదు కానీ, ఆ వయసు యువకులందరికీ ఆదర్శం కాగలవాడు తన శివుడు. ద్వేషం అంటే ఏమిటో వాడికి తెలీదు. తన చుట్టూ ఉన్న వారందర్నీ, తన, పర అన్న భేదం లేకుండా ప్రేమించటమే తను ఆ అబ్బాయికి నేర్పించింది.

బాల్యం దాటుతున్న వయసులో శివానంద అల్లరి చేష్టలకు హద్దులుండేవి కావు. భగవతికి దెబ్బలువేసే అలవాటు లేదు. నయానా. భయానా చెప్పటం అయింది. అప్పటికీ శివానందను హద్దులో ఉంచను చేతకాక, అతను తప్పు చేసిన ప్రతిసారి, తన్ను తానే శిక్షించుకోవటం మొదలుపెట్టింది .... కానీ అబ్బాయిని మాత్రం ఏమీ అనేది కాదు. ఈ మందే శివానందమీద బాగా పనిచేసింది. అతనిలో గొప్ప మార్పు వచ్చింది. అది మొదలు, అతను పెద్దమ్మ మనసు నొప్పించిన సందర్భాలను వేళ్ళమీద లెక్కించవచ్చును.

అప్పట్లో, భగవతి తండ్రి నారాయణస్వామిగారు బ్రతికున్న రోజులు. ముగ్గురూ, మూడు తరాలకు చెందినవారయినా, సమ వయస్కులవలె, స్నేహితుల మాదిరి మసులుకునేవారు.

చిన్నపిల్లల లాగా పోట్లాడుకోవటం, వాదించుకోవటం జరిగేవి. అప్పుడప్పుడూ తాతయ్య కోప్పడేవారు శివానందను. "ఒరే నువ్వెప్పుడూ, ముసలివాళ్ళ స్నేహంతోనే కాలం గడిపితే ఎలాగ? నీ వయసువారితో, స్నేహితులతో పొద్దుపుచ్చుకో పోరా" అనేవారాయన.

భగవతికి ఆయన వాదం నచ్చదు. స్నేహానికి వయసుతో నిమిత్తం ఏమిటి? వృద్ధాప్యం వయసును బట్టి రాదు. ఆలోచనల్లో నవ్యత, చేతల్లో చురుకుతనం వున్నవారంతా నవయువకులే- అంటుంది ఆమె.

శివానంద డాక్టరు కావాలని ఆశించింది గానీ, అతను వాయుదళాల్లో చేరాలని అనుకోలేదు. ఆ విషయంలో ఇంట్లో కొంత వాద, ప్రతివాదాలు జరిగాయి. శివానందకి ఎయిర్ ఫోర్స్ డాక్టరు కావాలని మంచి పట్టుదల ఉంది. ఈ విషయంలో తాతయ్య, మనవడ్ని పూర్తిగా సమర్థించి భగవతిని కూడా ఒప్పించారు.

• • •

ఆ రాత్రి ఆకలి, నిద్ర రెండూ భగవతి నుండీ దూరంగా వెళ్ళిపోయాయి. కంటిమీద రెప్ప వేయకుండా, వెలుగుతున్న దీపం వంక పిచ్చిదానిలా చూస్తూ, కలతబారిన మనసుతోనే కాలం గడిపేసింది. ఎర్రబారిన కళ్ళ నుంచీ కారుతున్న నీరు, చెంపలమీద చారికలు కడుతున్నది.

తన ఆశాదీపం శివానంద. తను పెళ్ళి చేసుకోలేదు. సంసారం, పిల్లలు, భర్త అన్న అనుభవాలు తెలీవు. తన హృదయంలో గూడుకట్టి ఉన్న ప్రేమానురాగాల నిధికి వారసుడు శివానంద. వాడే వెళ్ళిపోయిన తర్వాత, తన అస్తిత్వానికింకా అర్థం ఏముంది? తను బ్రతికుండి ఏంచేయాలి? చేయాల్సిందేమీ లేదు. కానీ ప్రాణాలు పోలేదు కనుక బ్రతికుండాలి.

ఆసలిట్లా ఎందుకు జరిగిందన్నదే భగవతికి అర్థంకాకుండా ఉంది. శివానందకి ముందెంతో ఉజ్వల భవిష్యత్తుంది. అతనింకా ఎందరికో ఎన్నో రకాలుగా సేవ, సహాయం చేయ్యవలసి ఉంది ఎన్నో అనుభవాలను పొందవలసి వుంది. తను అవన్నీ చూసి, ఆనందించాలనుకుంది. శివానంద సంతోషంలో పాలు పంచుకోవాలనుకుంది. ఇప్పుడింక ఏమీ లేదు, ఒంటరిగా తనొక్కర్తే మిగిలిపోయింది. ఏ జన్మలో ఏ పాపం చేసిందో! ఈ జన్మలో ఇలా అనుభవించవలసి వచ్చింది. అవును! ఇది తన దోషమే. ఇదే తన శివుణ్ణి పొట్టన పెట్టేసుకుంది! ఈ జన్మలో ఇంకా ఏం పాపాలు చేయాలనో, తన నుంచేసి,

దేవుడు వాణ్ణి తీసుకునిపోయాడు – అను కుంది భగవతి.

రాత్రి గడిచి, తూర్పున వెలుగురేకలు విచ్చుకునే సమయానికి, తను చేయవలసిం దేమిటో నిర్ణయించుకుంది. విదేశ యాత్రకు వెళ్ళడం వ్యర్థం అనిపించింది ఆ ఉత్సాహం అంతా నీరుకారిపోయింది. ఇంకా తను వెళ్ళి సాధించేదేముంది! తనున్న పరిస్థితిలో ఉద్యోగాన్ని కొన సాగించటం కూడా అసాధ్యంగా తోచింది. ఆ పేశే రాజీనామా వ్రాసి, కళాశాల మేనేజ్‌మెంట్ వారికి పంపుదా మనుకున్నది.

కణతలు పగిలేలా తల నొప్పిగా ఉన్నా కాలేజీకి బయలుదేరింది. ఏదయినా అనుకుంటే, ఆ పని వాయిదా వేసే అలవాటు లేదు భగవతికి. నిర్ణయించు కున్నది వెంటనే జరిగిపోవలసిందే.


ఎనిమిది గంటలకే వస్తున్న ప్రిన్సిపాల్‌గారి కారు చూసి, వాచ్ మన్ అదుర్దాగా గేటు తెరిచాడు. అతడు సలాం చేసినా, ఆమె చూడనట్లు లోపలికి పోయింది. వాచ్‌మన్ అనుభవంలో, ఆమె అలా చేయటం అదే మొదటిసారి

తన గదిలోకి వెళ్ళగానే ఎప్పటిలా టేబిలు సర్దిలేదు. కుర్చీలో కూచుని టేబిల్ సొరుగు బయటికి లాగింది. ఒక మూలగా, చిన్న పలుచని ప్లాస్టిక్ ఫోల్డర్ లోంచి శివానంద ఫోటో కనిపించింది. అలాగే చూస్తూ ఉండిపోయింది. కొన్ని క్షణాల తర్వాత ఫోటోను చేతుల్లోకి తీసు కుంది. చంపకి అనించుకుంది. కళ్ళు నిండిన నీరు బయటికి రాకుండా నిగ్రహించుకుంది ఫోటో తీసినప్పుడు, దాని కిందున్న రోజారంగు కవరొకటి కనిపించింది. దాని పైన తన చిరునామా వ్రాసిన దస్తూరి శివానందదే వాడు తనకు బుద్ధి తెలిసినతర్వాత వ్రాసిన మొదటి ఉత్తరం అది! ఆఖరిదీ అదేనేమో! అందుకనే తను దాన్ని భద్రంగా దాచు కుంది. అపురూపంగా కవర్ను చేతిలోకి తీసుకుని, ఉత్తరాన్ని బయటికి తీసింది. శివానంద రెండవ సంవత్సరం చదువుతూ వుండగా వ్రాసిన ఉత్తరమది.

నారాయణస్వామిగారు గుండెపోటుతో పోయారు

శివానంద మెడిసిన్ రెండవ సంవత్సరం పరీక్షలింక రెండు రోజులే ఉన్నాయి. అందుకనే తాతగారి అంత్య క్రియలు నిర్వర్తించిన తక్షణం బయల్దేరి వెళ్ళాల్సి వచ్చింది. మరి కొన్నాళ్ళు దగ్గరుండి పెద్దమ్మను ఓదార్చాలని ఉన్నా, వెళ్ళటం తప్పనిసరి అయింది. అందువల్ల వెళ్ళిన వెంటనే ఉత్తరం రాశాడు.

మూడు పేజీల ఉత్తరం అది. చివరి పేరాను మళ్ళీ చదువుకుంది భగవతి.



ఊ!! పత్రికలో నేను వ్రాసిందేదైనా ముందు నాతో చెప్పుంటే వండొద్దనే దాన్ని కదా !!

మంచి నిద్రలో ఎవరో తట్టి లేపినట్లుగా ఉలిక్కిపడింది.

"ఔను మీ తాతయ్య స్థానం భర్తీ చేయలేనిది. మన కాయన లేనిలోటు తీరేది కాదు. ఈ లోటు నీకు మరీ ఎక్కువగా కనిపించవచ్చు .... కానీ నువ్వీ బాధను మరిచి, మామూలుగా అవుతాయని నాకు తెలుసు నీ తాత్త్విక విధానమే నిన్నలా చేస్తుంది. నీవు నేర్పిన అందమయిన జీవిత సత్యాలు నాకు చిరస్మరణీయాలు. ఎదురొచ్చిన పరిస్థితి ఎలాంటిదయినా, చిరునవ్వుతో, ధైర్యంగా, మనిషిలాగా, మగవాడివలె, ఎదుర్కొనటం నేర్పింది నువ్వని, నేనెక్కడున్నా, నీ నుండి ఎంత దూరంలో ఉన్నా, మరవలేను".

ఆ వాక్యాలను పదేపదే చదువుకుంది భగవతి. శివానంద తన ఎదురుగా నిలబడి, తనతో మాట్లాడుతున్నాడా అనిపించింది.

'నాకు నేర్పిన పాఠాన్ని నువే పాటించటం లేదేమి? నీ స్వంత దుఃఖాన్ని, బాధను నీలోనే దాచుకుని, నీవు ఎన్నుకున్న దారిలో, ముందుకు నడచి వెళ్ళు' అని ఆదేశిస్తున్నట్లు తోచింది. కర్తవ్యాన్ని బోధిస్తున్నట్లు ఊహించుకుంది.

అప్పటికే కాలేజీ అంతా శివానంద మరణం గూర్చి తెలిసిపోయింది. ఇలాంటి స్థితిలో బాధపడుతూ ఇంట్లో ఉండిపోవలసిన ప్రిన్సిపాల్, మామూలు కన్నా ముందుగా కాలేజీకి వచ్చి కూర్చోవడం అందరికీ వింతగా ఉంది. ఉపాధ్యాయినులంతా గుంపుగా కలిసి

వచ్చారు భగవతిని పలకరించాలని. అంత మంది కూర్చోగలన్ని కుర్చీలు ప్రిన్సిపాల్ గదిలో లేవు. అందుకని భగవతి తనూ లేచి నిలబడింది.

"రండి రండి నేనే మీ అందరితో మాట్లాడదామని అనుకున్నాను."

"విషయం తెలిసి చాలా బాధపడ్డాము మేడమ్," అన్నది సుందరమ్మ. అంత కన్నా ఎక్కువగా భగవతి ఆ విషయాన్ని గురించి మాట్లాడనివ్వలేదు.

"మన కాలేజీ నుంచి ప్రతి సంవత్సరం నలుగురయిదుగురైనా అమ్మాయిలు మెడిసిన్ చేరుతుంటారు కదా? అలా సీటు వచ్చిన వారిలోనుండి, ఆర్థికంగా సహాయం అవసరం ఉన్న ఒకర్ని ఎన్నికుని, వారి చదువుకయే ఖర్చు భరించే విధంగా, మా అబ్బాయి పేరున స్కాలర్‌షిప్ ఏర్పాటు చేయదలచుకున్నాను. మీరంతా కలిసి ప్రతి సంవత్సరం నాకొక అమ్మాయి పేరును సెలక్ట్ చేసి ఇవ్వాలి," అని వాళ్ళందరికీ చెప్పింది.

లోపలికి రావచ్చా కూడదా అని తచ్చాడుతున్న భానుమతీ, మనోహరిలను "రండమ్మాయిలూ" అని పిలిచింది.

"మీ పార్టీ రేపు సాయంత్రం పెట్టుకోండి. నాకు వీలుగా ఉంటుంది. సరేనా? ఏమిటలా చూస్తున్నారు. నా ట్రిప్ కాన్సిల్ అయిందనుకున్నారా ఏం కొంప దీసి" అని అంటుంటే, నీరసంగా ఉన్న భగవతి ముఖంలో చిరునవ్వు మెరిసింది.

"అబ్బెబ్బే. అదేం లేదు మేడమ్. అలాగే రేపు మీకు పార్టీ ఇస్తాము" అన్నా రమ్మాయిలు తడబడుతూ.

క్లాసులకు సమయం అయిందన్న సూచనగా గంట మోగింది.

